క్లుప్తంగా

వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

కేవీపల్లె : దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లేళ్లమంద వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం నూతన కాల్వలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల తోపాటు గర్భవతులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రతిభ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీటీఎం జాతరకు రూ.2.91 లక్షల ఆదాయం

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం జాతరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపినట్లు ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్ తెలిపారు. రెండు రోజుల పాటు నడిపినందుకు రూ.2,91,977 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈపీకె 63.36, ఓఆర్ 120 వచ్చినట్లు తెలిపారు. జాతరలో డ్రైవర్లు సుధాకర్, రఫి, వంశీ, డ్రైవర్లు సుధాకర్, బాబు, శివలు అధికంగా ఆదాయం తెచ్చినట్లు తెలిపారు. వీరిని డీఎం అభినందించారు.

మెనూ పాటించాలి

తంబళ్లపల్లె : జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని మెనూ మేరకు నాణ్యతగా వడ్డించాలని ఎంఈవో త్యాగరాజు సూచించారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం నాబార్డు నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. హెచ్‌ఎం ఆంజనేయులు ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ

పెద్దమండ్యం : మండలంలోని శిద్దవరం కస్తూర్బా గాంధీ బాలికా గురుకుల విద్యాలయాన్ని అన్నమయ్య జిల్లా ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, ప్రత్యేక అధికారి డాక్టర్ పి.చంద్రశేఖర గురువారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో కుమారి, డాక్టర్ హరివర్మ, సీహెచ్‌ఓ క్రిష్ణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

వాల్మీకిపురం: కుష్టువ్యాధి వంశపారం పర్యం కాదని, ఎవరికైనా రావచ్చునని డీపీఎంవో శ్రీనివాసులు, చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారిణి మానస తెలిపారు. గురువారం చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పర్శలేని పెద్ద మచ్చలను త్వరగా గుర్తించి, చికిత్సను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి పంచాయతీ చారావాండ్లపల్లి సచివాలయం పరిధిలోని ఎర్రగుంట్లబావి, గోవిందరాజపురం, మేకలవారిపల్లి, రాములవారిపల్లిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పక హాజరుకావాలని వారు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కేవీపల్లె : ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.14,860 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. గురువారం మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ శెట్టిపల్లివాండ్లపల్లె వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో దాడి చేసి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ జులేఖాబేగం

నిమ్మనపల్లె : గ్రామీణ ప్రజలకు క్షేత్రస్థాయిలో అందించే ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్.జులేఖాబేగం అన్నారు. గురువారం మండలంలోని ముష్టూరులో ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో వృద్ధులు, బాలింతలు, రోగులు, దివ్యాంగులకు చికిత్సలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన రోగనిర్ధారిత పరీక్షలు చేశారు. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అబీదా, 104, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ స్థల పరిశీలన

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీలో డిస్కం ఎస్‌ఈ క్రిష్టారెడ్డి గురువారం పర్యటించారు. నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు అవసరమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఒక్కో సబ్ స్టేషన్‌ను రూ.1.50 కోట్ల నిధులతో పనులు చేపడతామన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు గిరీష్, ఉత్తన్నలతో పాటు డీఈ, ఈఈ, ఏఈలు రుక్మేంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, ఉత్తన్న, రామలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

అన్నమయ్య జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



లోక్ అదాలత్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ మురళీకృష్ణ, సత్యనారాయణ

మదనపల్లె : కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్‌అదాలత్ ధ్యేయమని, ఇందులో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా రాజీపడి ప్రశాంత జీవనానికి మార్గాన్ని ఏర్పాటుచేసుకోవాలని టూటౌన్, రూరల్ సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ అన్నారు. ఫిబ్రవరి 11న జాతీయలోక్ అదాలత్ కార్యక్రమ నేపథ్యంలో మండల న్యాయసేవాధికార సంస్థ, అన్నమయ్యజిల్లా పోలీసు మదనపల్లె సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అనిబిసెంట్ సర్కిల్‌లో ర్యాలీని ప్రారంభించిన సీఐ మురళీకృష్ణ విద్యార్థులతో కలిసి బెంగళూరు బస్టాండు వరకు ప్రదర్శనగా వెళ్లారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్, ట్రాఫిక్ ఎస్‌ఐ రామాంజనేయులు, సుభద్ర, లెక్చరర్స్ మోహనవల్లి, జ్యోతి, ఖాజావలి, శ్రీధర్, అజయ్‌కుమార్, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ర్యాలీ

పెద్దమండ్యం: జాతీయ లోక్ అదాలత్‌పై మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ పి వెంకటేష్ తెలిపారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిరణ్‌కుమార్, నిజాముద్దీన్, హారతి, మధు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : ఈ నెల 11న స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం విద్యార్థులు, వివిధ యూనియన్ నాయకులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహుడు పాల్గొన్నారు.

కలకడ : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలకడ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ సిటి స్వామి కోరారు. గురువారం కలకడ-గుర్రంకొండ రోడ్డు మార్గంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 11వ తేదీన అన్నమయ్య జిల్లాలోని అన్ని కోర్టుల వద్ద జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో ఎస్‌ఐ మధు రామచంద్రుడు గురువారం జాతీయ మెగా లోక్ అదాలత్‌పై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు కేసులు పెట్టుకుని నిత్యం కోర్టులు,స్టేషన్ల చుట్టూ తిరగకుండా గ్రామస్తులతో కలసి సున్నితంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని హితబోధ చేసారు.

వాల్మీకిపురం: రాజీ మార్గమే రాజమార్గమని, ఎలాంటి ఫీజులు లేకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చునని వాల్మీకిపురం ఎస్సై బిందుమాధవి అన్నారు. గురువారం స్థానిక గాంధీబస్టాండ్ నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 11వ తేది జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

లోక్ అదాలత్‌లో కేసులు రాజీ

రామసముద్రం : ఈనెల 11న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా వివిధ రకాల కేసులు పరిష్కరించడం జరుగుతుందని ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన తన సిబ్బందితో కలసి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి హైస్కూల్ వీధి మీదుగా బజారువీధి వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పరిష్కరించుకోలేని సివిల్, క్రిమినల్ కేసులు ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్ధన స్వామి

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్ధనస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా గురువారంతో స్వామివారి ఉత్సవాలు ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిభట్టర్, కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మదనపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి

మదనపల్లె : రాష్ట్ర అటవీ, ఇంధన, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం మదనపల్లెలో పర్యటించారు. స్థానిక చౌడేశ్వరి కల్యాణమండపంలో జరిగిన వివాహానికి హాజరైన ఆయన స్థానిక నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న సచివాలయ గృహసారథులు శిక్షణా తరగతులపై చర్చించుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మంత్రి

కురబలకోట: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం మండల వైఎస్సార్ సీపీ నాయకులు, అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి కుమార్తె లీలా భార్గవి, కిరణ్‌కుమార్‌రెడ్డి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. చౌడేశ్వరి కళ్యాణ మండలంలో జరిగిన వివాహానికి హాజరై జంటను ఆశీర్వదించారు.

జగన్ పథకాలను ఊరూ వాడా చాటండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్ పథకాలను ఊరూ వాడా చాటి చెప్పాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచించారు. గురువారం ఆయన మండలంలోని రామిగానిపల్లెలో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ సచివాలయ కనీ్వనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించడం జరిగిందన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. నవరత్నాలతో నవశకం తెచ్చాడన్నారు. రాష్ట్ర ప్రజలకు జగన్‌లా ఇన్ని పథకాలు ఇచ్చిన సీఎం దేశంలోనే మరెవ్వరూ లేరన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం జగన్

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మెగా జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : సంక్షేమ పథకాల సృష్టికర్త మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పీలేరు పట్టణం ఎల్‌బీఎస్ రోడ్డు, బీవీరెడ్డి నగర్, వేణుమహల్ రోడ్డు, మల్లెలవారి వీధి, శంకరాపురం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, అప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే పథకాలతో ప్రతి కుటుంబానికి ఏదోవిధంగా లబ్ధి చేకూరుతోందన్నారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి..

మదనపల్లెలో శుక్రవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గురువారం పీలేరులో మెగా జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డిబాషా, వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత, నాయకులు డాక్టర్ వెంకటరామయ్య, గడిబాషా, కంభం భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, కాలేషా, షాకీర్, కాలనీ చిన్న, హరి, శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

హెపటైటిస్–బి వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలి

మదనపల్లె : హెపటైటిస్-బి వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ డాక్టర్.దివాకర్ అన్నారు. గురువారం ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రం వద్ద హెపటైటిస్-బి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తోందన్నారు. హెచ్‌ఐవీ మందులు వాడుతూ ఇప్పటివరకు హెపటైటిస్ బారిన పడకుండా ఉన్న రోగులు మాత్రమే వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. మూడు డోసులు వ్యాక్సిన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్.పాల్ రవి కుమార్, ఏఆర్‌టీ సిబ్బంది పురుషోత్తం, భరత్‌బాబు, లీల, హారతి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

మదనపల్లె : టపాసులు పేల్చిన కారణంగా ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. మండలంలోని కొత్తవారిపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు సీటీఎం జాతర సందర్భంగా శ్రీ నలవీర గంగాభవాని అమ్మవారికి అన్నం బండి కట్టారు. ఊరేగింపు నిర్వహణలో భాగంగా టపాసులు పేల్చారు. పేలిన టపాసులు గ్రామంలోని మల్లికార్జున, రమణలకు చెందిన గడ్డివాములపై పడ్డాయి. ఘటనలో గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. బాధితులు మదనపల్లె అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వెళ్లేసరికి గడ్డివాములు పూర్తిగా కాలిపోయి రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

ఆరోగ్య పరీక్షలతో తల్లీబిడ్డ క్షేమం

పీలేరు : గర్భవతులు సరైన సమయంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం తలపుల పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పీహెచ్ఎన్ వెంకట సుబ్బమ్మ, సూపర్‌వైజర్‌లు కృష్ణయ్య, స్టాఫ్‌నర్స్ లక్ష్మీ, ఏఎన్ఎం నాగవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షిత ప్రసవం

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం-తల్లి బిడ్డ క్షేమం అని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించి ప్రతి గర్భవతి పరీక్షలకు హాజరు కావాలన్నారు. రక్త పరీక్షలకు 36 మంది హాజరు కాగా ప్రసవం కష్టతరంగా భావించిన 14 మందిని గుర్తించి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10-19 సంవత్సరాల కిషోర బాలికలకు సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ ముజీబ్, ఏఎస్‌యం వాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం, గుట్కా స్వాధీనం

మదనపల్లె : కర్నాటక మద్యం, నిషేధిత గుట్కా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. సత్యసాయిజిల్లా కదిరి పట్టణానికి చెందిన కే.ముజాహిదీన్‌బాషా(28) మదనపల్లె మండలం కొండామారిపల్లె సత్యసాయి కాలనీకి చెందిన బావాజాన్(36) బుధవారం రాత్రి గుట్కా ప్యాకెట్లతో 10 కర్నాటక మద్యం బాటిళ్లను తీసుకువస్తుండగా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు.

గురుకుల పాఠశాలల్లో బాలికలకు భద్రత

ప్రత్యేక అధికారిణి ధనలక్ష్మి



విద్యార్థినిలతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారిణి ధనలక్ష్మి

కలకడ : జిల్లాలోని బాలికల గురుకుల పాఠశాలల్లో మరింత భద్రత కల్పించడానికి సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని బాలికల గురుకుల పాఠశాల ప్రత్యేక అధికారిణి, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి, డిపిఓ ధనలక్ష్మి ఆదేశించారు. గురువారం కలకడ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినిలకు పాఠశాలలో కానీ, కుటుంబాలలో కానీ ఎలాంటి సమస్యలు ఉన్నా గుప్తంగా తెలియజేయవచ్చునని కోరారు. అనంతరం పాఠశాలలో విదార్థినిలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కిచెన్, విశ్రాంతి గదులు, నీటి సౌకర్యం పరిశీలించి, ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, ఆపాఠశాల ఎస్ఓ అనిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యశోదరాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు

నిమ్మనపల్లె : ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీడీపీఓ సుజాత తెలిపారు. గురువారం మండలపరిధిలోని ముష్టూరు కేజీబీవీ రెడ్డివారిపల్లె ఆదర్శపాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతిగృహ విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటుచేశామన్నారు. కమిటీలో స్కూల్ ప్రిన్సిపాల్, మెడికల్ ఆఫీసర్, సీడీపీఓ, ఎంఈఓ సభ్యులుగా ఉంటారన్నారు. ప్రతివారం వసతిగృహాలను పర్యవేక్షిస్తామన్నారు. విద్యార్థినులు తమ సమస్యలను ధైర్యంగా చెప్పాలన్నారు. సెలవులకు ఇంటికి వెళ్లినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థినులు ఎదుటివారి ప్రవర్తనపై అనుమానం కలిగితే నిస్సందేహంగా అధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్.జులేఖాబేగం, కేజీబీవీ ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కే.ఎస్.ఎన్.మూర్తి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణపై అవగాహన

తంబళ్లపల్లె: స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ అధికారులు కిషోర బాలికలకు ఆత్మరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో నాగవేణి బాలికల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆత్మరక్షణ, హైజీన్ అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్వేత, టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వాసంతో లూర్దుమాత ఆశీస్సులు



లూర్దుమాత గొప్పతనాన్ని వివరిస్తున్న పాదర్ బెన్ని

కడప కల్చరల్: విశ్వాసంతోనే లూర్దుమాత ఆశీస్సులు పొందవచ్చని ఏలూరు జ్ఞాన కేంద్రం డైరెక్టర్ ఫాదర్ బెన్ని అన్నారు. కడప నగరం మరియాపురం పాత చర్చి ఆవరణలో నిర్వహిస్తున్న లూర్దుమాత తిరునాల కార్యక్రమాల్లో భాగంగా 8వ రోజు చర్చి ప్రధాన వేదికపై ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఇందులో భాగంగా లక్కిరెడ్డిపల్లె విచారణ గురువు పాదర్ విజయమోహన్‌రెడ్డి దివ్య బలిపూజ నిర్వహించారు.

అనంతరం పాదర్ బెన్ని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దైవభక్తితోపాటు దైవభీతి కూడా ఉండాలని, మానవులు ఆత్మను దేవుని మందిరంగా మార్చి హృదయ శుద్ధితో జీవించినపుడు దేవుడు ఆశీర్వదిస్తారని తెలిపారు. తొలుత అలంకరించిన తేరుపై మరియమాత స్వరూపాన్ని నిలిపి మరియాపురం వీధుల్లో భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రధాన వేదిక వద్ద ప్రతిష్ఠించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మరియాపురం విచారణ గురువు బిరుసు రాజా, సహాయ గురువు పాదర్ కె.చంద్ర, పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ బి.సతీష్, బిషప్ కార్యదర్శి పాదర్ గోవింద్ భూపేష్, బిషప్ హౌస్ ఇన్‌ఛార్జి పాదర్ లూర్దు, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాది జోసెఫ్, ఉపాధ్యక్షులు పి.విజయకుమార్, కార్యదర్శి పి.లూర్దు, కోశాధికారి యు.విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు నగరంలో ఊరేగింపు

లూర్దుమాత తిరునాలలో భాగంగా 9వ రోజు కార్యక్రమాల్లో ప్రధానమైన తేరు ప్రదక్షిణ నిర్వహించనున్నారు. సాయంత్రం నగరంలోని డాన్‌బాస్కో చర్చిలో దివ్య బలిపూజ, ప్రసంగం అనంతరం కారుణ్యమాత సభ గురువుల ఆధ్వర్యంలో లూర్దు మాత స్వరూపాన్ని ప్రత్యేకమైన రథంపై ఊరేగించనున్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో గురువారం జగనన్న పక్కా గృహాల లబ్ధిదారుల సౌకర్యార్థం కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గడప, గడపకూ మన ఎమ్మెల్యే కార్యక్రమంలో వచ్చిన ప్రజా వినతుల్లో భాగంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు డిస్కం ఏఈ ఉత్తన్న తెలిపారు. సదరు పనులను ఎంపీపీ మహమూద్, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌లు పరిశీలించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.కవిత తెలిపారు. బ్రాండెడ్ లేబర్ దినోత్సవ సందర్భంగా గురువారం నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని భార్గవ్ కెమికల్స్ ఇండస్ట్రీ, పీవీఎస్ కెమికల్స్ ఇండస్ట్రీలను ఆమె తనిఖీ చేసి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె కార్మికులకు అందుతున్న సదుపాయాలు, వారు పని వేళలు, జీతభత్యాలు, ఇతర సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తం వన్‌స్టాప్ సెంటర్ అని, ఒకేచోట అనేక సేవలు అందుతున్నాయన్నారు.